క్లుప్తంగా

23న ప్రవేశ పరీక్ష

రేపల్లె రూరల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యా సంస్థలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల 23న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ గిరికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 5వ తరగతి ప్రవేశానికి 23న ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

వేగవంతంగా రీ–సర్వే



రేపల్లె: 'మీ భూమి–మా హామీ' రీ–సర్వే పనులు పట్టణంలో వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి పేర్కొన్నారు. 9వ వార్డులో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఈ సర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రీ–సర్వే ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రతి భూ కమతానికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించి, రికార్డులను సురక్షితంగా, వివాద రహితంగా రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ స్రవంతి, వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఎం.మురళీకృష్ణ, రవికుమార్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుట కొరకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీరులో పురుగు మందు కలుపుకుని..

భట్టిప్రోలు: మద్యానికి బానిసైన ఓ యువకుడు బీరులో పురుగు మందు కలుపుకుని బలవన్మరణానికి పాల్పడి.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. భట్టిప్రోలు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలేనికి చెందిన బేతాళ ప్రసాద్(32) ఈ నెల 17న బీరులో పురుగు మందు కలుపుకుని తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలకు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు ప్రసాద్ తల్లి వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

చర్యలు తీసుకోండి

పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం శిథిలావస్థకు చేరుకునే విధంగా చేసిన వారిపై రాజద్రోహం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ బహుళార్థక సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గొర్రుముచ్చు ఆనందరావు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ 2011లో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది అంబేడ్కర్ జయంతిని నిర్వహించేందుకు వెళ్లేసరికి విగ్రహం వద్ద అపరిశుభ్ర వాతావరణంతో పాటు విగ్రహం రూపురేఖలు మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల పరిషత్ కో–ఆప్షన్ మాజీ సభ్యులు మద్దాల డేవిడ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు చెరుకూరి ఆనంద్‌మోహన్, అంబేడ్కర్ సంఘ సభ్యుడు జక్కల డేవిడ్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు

తెనాలిఅర్బన్: విఘ్నేశ్వర మెడికల్స్ సహకారంతో తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని 87 బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. విఘ్నేశ్వర మెడికల్స్ నిర్వాహకులు భార్గవ్ చైతన్య శుక్రవారం 100 ఫస్ట్ ఎయిడ్ కిట్లను డీఎంకు అందజేశారు. ఆర్టీసీ తోడ్పాటుకు సహకారం అందిస్తున్న అధికారులు, దాతలకు డీఎం కృతజ్ఞతలు తెలియజేశారు. భార్గవ్ చైతన్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీలో అవసరమైన వస్తువులను కూడా కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ రఘురామయ్య చేతుల మీదుగా గ్యారేజ్ సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘురామ్ నాయక్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వెల్లివిరుస్తున్న సంక్షేమం, సంతోషం

- 'గడప గడపకు' మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అమృతలూరు(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, సంతోషం వెల్లివిరుస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలం గోవాడలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే సాంకేతిక కారణాలను పరిశీలించాలని వలంటీర్లకు సూచించారు. నాలుగేళ్లల్లో చేపట్టిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ.. కరపత్రాలు అందించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిన విధానాన్ని తెలుసుకునేందుకు.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యలవర్తి సురేష్, రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టర్ ఓలేటి శివాజీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మండవ శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సభ్యులు దేవరకొండ శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ సీహెచ్‌వీసీ చౌదరి, కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ బందిలి చెత్తయ్య, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు తాడికొండ సీతారామయ్య, నూతక్కి చెన్నకేశవులు, ఆలపాటి రమాదేవి, దేవరపల్లి చిన్నబ్బాయి, బలిజేపల్లి శివనాగమల్లేశ్వరరావు, నూతలపాటి సురేష్, పావులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారుచేస్తే చర్యలు తప్పవు



నాటుసారా తయారుచేస్తున్న అంకరాజుతో సెబ్ పోలీసులు

నగరం: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా.. కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పెదమట్లపూడి పంచాయతీ పరిధిలో నాటు సారా తయారీ బట్టీని శుక్రవారం సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పెదమట్లపూడిలోని పోతురాజు స్వామి గుడి వెనక వైపు గల లుక్కా అంకరాజు ఇంటి మరుగుదొడ్డిలో నాటుసారా బట్టీని గుర్తించామన్నారు. బట్టీని ధ్వంసం చేసి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నాటు సారా తయారు చేస్తున్న అంకరాజును అరెస్ట్ చేసి రేపల్లె సబ్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా విక్రయాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉపాధ్యాయుడు కోటేశ్వరరావుకు సన్మానం



చెరుకుపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన వారికి గుర్తింపు, గౌరవం దక్కుతుందని, అందుకు నిదర్శనం.. ఉపాధ్యాయుడు మరదాప కోటేశ్వరరావుకు జ్యోతిరావు పూలే జీవిత సాఫల్య ఉపాధ్యాయ అవార్డు దక్కటమే అని ఎంఈఓ టి.నవీన్ కుమార్ అన్నారు. ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న కోటేశ్వరరావుకు ఇటీవల తిరుపతిలో ఈ అవార్డును ప్రధానం చేశారు. శుక్రవారం ఆరేపల్లి పాఠశాల ఆవరణలో కోటేశ్వరరావుకు సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్త్రీలకు విద్యనందించటంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని కల్పించిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని, అటువంటి గొప్ప వ్యక్తి పేరు మీద కోటేశ్వరరావు అవార్డు అందుకోవటం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు, రచయిత పగడం వీరాస్వామి రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ పి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తాతా సుబ్బారావు, కాటూరి నాగేశ్వరరావు, షంషుద్దీన్, సీఆర్పీ వినీల, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న చీరాలలో ఈఏపీ సెట్ మోడల్ టెస్ట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బాపట్ల అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రంగాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష 'ఈఏపీ సెట్' మోడల్ ఆన్‌లైన్ టెస్టులను నెల 24 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఆన్‌లైన్ టెస్టులకు సంబంధించిన పోస్టర్‌ను వీజీఆర్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల డైరెక్టర్ గిరిధర్ ఆవిష్కరించారు. బాపట్ల జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మనోజ్ కుమార్, ఆర్య మాట్లాడారు. అనుభవజ్ఞులైన చుక్కా రామయ్య, ఐఐటీ అకాడమీ నుంచి సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో తయారు తయారు చేయించిన మోడల్ మాక్ టెస్ట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని బాపట్ల జిల్లా విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ 25 సంవత్సరాల నుంచి ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్స్, నీట్ వంటి వివిధ పోటీ పరీక్షలకు మోడల్ పరీక్షలు నిర్వహించడంలో ముందుంటున్నారు. ఈ నెల 25న చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరిగే ఈ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షకు రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో, మొబైల్ నంబర్లు 81211 11513, 94909 87646కు సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచ్చేరి



గానం చేస్తున్న డాక్టర్ చింతలపాటి మంజుల

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ శ్యామశాస్త్రి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మ పేటలోని శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలో నిర్వహించిన కర్ణాటక సంగీత కచ్చేరి భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన డాక్టర్ చింతలపాటి మంజుల గానం సంగీతాభిమానులకు వీనులవిందు చేసింది. చావలి శ్రీనివాస్ వయొలిన్‌పై కేవీ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



తెనాలిటౌన్: బోసు రోడ్డులోని శ్రీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం బాబాకు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు. మందిరంలో బాబావారి నిలువెత్తు ఫొటోను ఓంకార్ గ్రాఫిక్స్ సహకారంతో ప్రతిష్ఠించారు.సాయంత్రం పుర వీధులలో బాబాను పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. మందిర కమిటీ అధ్యక్షుడు ఎస్.దుర్గాప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.

కఠెవరంలోప్రకృతి రైతుల ప్రదర్శన



కఠెవరం(తెనాలి): కఠెవరం గ్రామంలో శుక్రవారం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై ప్రకృతి రైతులు ప్రదర్శన చేశారు. రైతుసాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలో గ్రామంలోని ప్రతి రైతు భాగస్వామి కావాలని కోరుతూ గ్రామంలోని రైతులు, మహిళా సంఘాలు ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం, కఠెవరం యూనిట్‌కు చెందిన జి.విజయకుమారి, ఐసీఆర్పీ కె.రత్నకుమారి, బీఓఎల్.స్వరూపరాణి, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



బ్రోచర్ అందజేసిన కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి

కర్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నాగరాజుపాలెంలో జరుగుతున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్టిక్కర్లు అంటించి బ్రోచర్లు అందజేశారు. కర్లపాలెం, చింతాయపాలెం, ఏట్రవారిపాలెం, పేరలి యాజలి గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చినపరిమిలో ఫ్యామిలీ ఫిజీషియన్

చుండూరు(భట్టిప్రోలు): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వేటపాలెం పీహెచ్‌సీ పరిధిలోని చిన పరిమిలో శుక్రవారం డాక్టర్ రవి ప్రకాష్ వైద్య శిబిరం నిర్వహించారు. 90 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి విచ్చేసి, చిన్నారుల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు, పోషక లోపాలు గుర్తించి వారి తల్లులకు సూచనలు చేశారు. అలాగే టీబీ రోగులను పరీక్షించి, అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పలస్వామి గుడిలో చోరీ

తెనాలిరూరల్: పట్టణంలోని అప్పలస్వామి గుడిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోకి శుక్రవారం తెల్లవారుజామున ప్రవేశించిన ఇద్దరు హుండీలను ధ్వంసం చేశారు. గర్భాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినా వారికి సాధ్యపడలేదు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఆలయం వెనుక వైపు గోడ దూకి వచ్చిన ఇద్దరు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. హుండీల్లో సుమారు రూ. 2 వేల నగదు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ ఆడిట్‌పై సీఆర్పీలకు శిక్షణ

పిట్టలవానిపాలెం: విద్యా వనరుల కేంద్రంలో సోషల్ ఆడిట్‌పై శుక్రవారం సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయి రీసోర్సు పర్సన్, మంతెన వారి పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోషల్ ఆడిట్ నిర్వహణపై సమగ్ర శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు, సీఆర్పీలు కమల, మునలయ్య, స్రవంతి ఉన్నారు.

మహాసంస్కర్త భగవత్ రామానుజులు

1006వ తిరు నక్షత్ర మహోత్సవాల్లో డాక్టర్ ఎంటీ ఆళ్వార్‌స్వామి



తిరునక్షత్ర మహోత్సవాల్లో ఆళ్వార్ స్వామి

తెనాలి: 'సమాజ వికాసానికి అడ్డుగా నిలిచే నమ్మకాలు ఎంత ప్రాచీనమైనవి అయినా సరే, మార్చాల్సిందే...మనమూ దారి మార్చుకోవాల్సిందే'నంటూ వెయ్యేళ్ల క్రితమే చాటిన మహా సంస్కర్త భగవత్ రామానుజులు అని ప్రముఖ పండితుడు డాక్టర్ ఎంటీ ఆళ్వార్‌స్వామి చెప్పారు. పట్టణానికి చెందిన శరణాగతి గోష్టి ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులు పాటు జరగనున్న శ్రీభగవత్ రామానుజాచార్యులు 1006వ తిరు నక్షత్ర మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో యర్రంశెట్టి గంగాధర్, వెంకట రమేష్‌బాబు స్థల ప్రాంగణంలో ఏర్పాటైన వేదికపై జరిగిన ఉత్సవాల్లో భాగంగా 'శ్రీ భగవత్ శ్రీరామానుజుల వారి సంఘ సంస్కరణలు' అనే అంశంపై ఆళ్వార్ స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. విశిష్టాద్వైతం ద్వారా భక్తి, జ్ఞానం పెంపొందించుకోవాలని, కుల, మతాలు లేవని, అందరూ భగవంతుడిని చేరటానికి కృషి చేయాలని రామానుజులు ప్రచారం చేసినట్లు తెలిపారు. ఆ మహనీయుడు చేసిన సంస్కరణలన్నీ భారతీయ సమాజానికి అంతరాత్మలాంటి దేవాలయాల కేంద్రంగా జరిగాయని చెప్పారు. ప్రతి క్షేత్రం కులం కంటే భక్తి ప్రధానమన్న మహత్తర సందేశాన్ని వినిపించిందని వివరించారు. రామానుజుల మాట ఆచరణీయమని సూచించారు. సభానంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

శోభాయమానంగా మసీదులు



రేపల్లె పట్టణం పోస్టాఫీసు సెంటరులో..వెలిగిపోతున్న పెద్ద మసీదు

రేపల్లె రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని వివిధ మసీదులు విద్యుద్దీపాలతో శోభాయమానంగా వెలిగిపోతున్నాయి. పెనుమూడి రోడ్డు, పెద్ద పోస్టాఫీసు రోడ్డు, రామకోటి పేట, లక్ష్మీ టాకీసు సెంటరులోని మసీదులతో పాటు పలు మసీదులను అలంకరించారు. శనివారం నమాజు నిర్వహించేందుకు ఉయ్యూరువారి పాలెం రహదారిలోని ఈద్గాలను సిద్ధం చేశారు.

పవిత్ర మాసం రంజాన్

– మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



రంజాన్ తోఫా అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, షేక్ ఇమామ్ హుస్సేన్

అమృతలూరు(భట్టిప్రోలు): పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు మహ్మద్ ప్రవక్త అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంత్రి నాగార్జున అమృతలూరులో 130 కుటుంబాలకు రంజాన్ జకాత్ తోఫా అందజేశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ రంజాన్ సమతా భావాన్ని చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, జెడ్పీటీసీ మూల్పూరు లావణ్య, సర్పంచ్ దేవరకొండ రాము, మూల్పూరు సొసైటీ చైర్మన్ యలవర్తి భూషయ్య, పోతార్లంక సురేష్, గడ్డిపాటి హేమచంద్ర శ్రీనివాస్, నూతక్కి బసవ శంకరరావు పాల్గొన్నారు. అలాగే.. చుండూరు మండలం మోదుకూరుకు చెందిన అక్బర్ బాషా అల్లుడు మృతి చెందడంతో కుమార్తె ఫాతిమా కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని ఇమామ్ హుస్సేన్ మంత్రి నాగార్జున చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ప్రచారయాత్ర ప్రారంభం



ప్రచార యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

రేపల్లె రూరల్: ప్రధాన మంత్రి నరేంద్రమోది ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోకుంటే మూల్యం చెల్లించుకోకతప్పదని సీపీఎం రాష్ట్రవర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. మోది ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పట్టణంలో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాజకీయ ప్రచారం యాత్రలో ఆమె మాట్లాడారు. మోది ప్రభుత్వం కార్పొరేట్ ప్రభుత్వమని, పేదలను దోచుకుని కార్పొరేటర్లకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ పద్ధతిని మార్చుకోకుంటే ప్రజావ్యతిరేకతకు గురికాకతప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తనిరు సింగురుకొండ, సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి జి.బాలాజీ, సీపీఎం, సీపీఐ నాయకులు కె.ఆశీర్వాదం, బి.శ్రీనివాసరావు, పి.మావో తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కమిటీ నేతలు

తెనాలి: జాతీయ హ్యాండ్‌బాల్ జట్టుకు దక్షిణాది రాష్ట్రాల్నుంచి ఎంపికైన ఏకైక తెనాలి క్రీడాకారుడు జెర్రిపోతుల మధుబాబును శుక్రవారం తెనాలి బాబు జగజ్జీవన్‌రామ్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. బల్గేరియా రాజధాని సోఫియాలో ఈ నెల 25 నుంచి అయిదు రోజుల పాటు జరగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు గోల్ కీపర్‌గా మధుబాబు ఆడనున్నారు. ఇదేరోజు రాత్రి బల్గేరియా ప్రయాణం కడుతున్న మధుబాబు ప్రయాణ ఖర్చుల నిమిత్తం జగజ్జీవన్‌రామ్ కమిటీ రూ.30 వేల నగదును సాయంగా అందించింది. కోచ్ కె.నాగరాజును అభినందించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ లాబీలో జరిగిన కార్యక్రమంలో కమిటీ నేతలు అత్తోట చంటి, మేకల సురేష్, అత్తోట శరత్, పల్లపాటి ప్రేమ్, కొమ్ము రాయల్, అత్తోట శ్యామ్, నలుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదల పాపం కేంద్రానిదే



పాండురంగ పేటలో ప్రచార యాత్ర

తెనాలి: దేశ వ్యాప్తంగా పెట్రోలు, డీజిల్‌తో సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని సీపీఎం సీనియర్ నేత ములకా శివ సాంబిరెడ్డి విమర్శించారు. గత తొమ్మిదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్ సంస్థలకు వరాల జల్లు కురిపిస్తోందని ఆరోపించారు. సీపీఐ, సీపీఎం ప్రచార యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణ 27వ వార్డులోని పాండురంగ పేట పేదల కాలనీలో ప్రచారం చేశారు. వంట గ్యాస్, కరెంటు బిల్లు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలకు కారణమైన బీజేపీని గద్దె దించేందుకు ప్రజలు ఉద్యమించాలని కోరారు. సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ఎన్.రాజ్యలక్ష్మి, సీపీఐ నాయకులు పల్నాటి నాగరాజు పాల్గొన్నారు.